3, 4, 5 తేదీల్లో పల్స్‌పోలియో

విజయనగరంకోట : మార్చి 3న నేషనల్ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా 3, 4, 5 తేదీల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. మార్చి 3న మెగా వాక్సినేషన్ డ్రైవ్‌గా ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని తెలిపారు. మిగిలిపోయిన వారికి ఇంటింటికీ వెళ్లి 4, 5 తేదీల్లో పోలియో చుక్కలు వేయాలన్నారు. మారుమూల గ్రామాల్లో , కొండ ప్రాంతాల్లో, గిరిజన, మత్స్యకార ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని, బస్సుస్టాండ్, రైల్వేస్టేషన్లలో పోలియో బూత్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. అన్ని ఆసుపత్రుల్లో కూడా పోలియో చుక్కలను వేయుటకు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. రెండో తేదీనే అన్ని గ్రామాల్లో టామ్ టామ్ వేయించాలని సూచించారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా సమాచారం ఇంటింటికీ వెళ్లేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి భాస్కరరావు, డిఐఒ అచ్యుతవల్లి తదితరులు పాల్గొన్నారు.

మిమ్స్ యాజమాన్యం దిగిరావాల్సిందే

- అప్పటి వరకూ పోరాటం ఆగదు
- సిఐటియు జిల్లా నాయకులు సురేష్, టివి రమణ
- కలెక్టరేట్ ఎదుట మిమ్స్ ఉద్యోగుల 24 గంటల ధర్నా
- ఉద్యోగులకు మద్దతుగా ప్రజాసంఘాల ఆధ్వర్యాన పలుచోట్ల ఆందోళనలు

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు టివి రమణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మిమ్స్ యాజమాన్యం దిగొచ్చే వరకూ పోరాటం ఆపేది లేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు టివి రమణ తేల్చిచెప్పారు. మిమ్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట 24 గంటల ధర్నా సోమవారం ప్రారంభమైంది. మిమ్స్ ఉద్యోగుల పోరాటానికి మద్దతుగా ప్రజా సంఘాల ఆధ్వర్యాన జిల్లాలో పలుచోట్ల రాస్తారోకోలు, ఆందోళనలు చేపట్టారు. కలెక్టరేట్ వద్ద ధర్నాను సురేష్, రమణ ప్రారంభించి, మాట్లాడారు. 19 రోజులుగా మిమ్స్ ఉద్యోగులు నిరసన చేపడుతున్నా యాజమాన్యం ముందుకు రాకపోవడం దారుణమన్నారు. ఉద్యోగులకు బకాయి ఉన్న ఏడు డిఎలను ఎరియర్స్‌తోపాటు చెల్లించి, వెంటనే వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. కక్ష సాధింపుల్లో భాగంగా కొంతమంది ఉద్యోగులను బదిలీ చేశారని, వారికి మిమ్స్‌లో డ్యూటీలు ఇవ్వాలని కోరారు. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 2019లో వేతన ఒప్పందానికి ఉద్యోగులు పోరాడిన సందర్భంగా కొంతమంది ఉద్యోగులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలన్నారు. సస్పెండ్ చేసిన ఇద్దరు ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. మరోవైపు యూనియన్ లేకుండా చట్టవ్యతిరేకంగా మిమ్స్ యాజమాన్యం వ్యవహరిస్తోందన్నారు. ఈ విషయంపై కలెక్టర్ జోక్యం చేసుకొని ఉద్యోగులు, యూనియన్‌తో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ధర్నాకు ఎం.నారాయణరావు, ఎఐఎఫ్‌టియు నాయకులు బి.శంకరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు హరీష్, శ్రామిక మహిళా సంఘం నాయకులు బి.సుధారాణి మద్దతు తెలిపారు.

ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో

మిమ్స్ ఉద్యోగుల పోరాటానికి మద్దతుగా విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సిఐటియు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, కెవిపిఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా నాయకులు రెడ్డి శంకర్రావు, మాట్లాడుతూ మిమ్స్ ఉద్యోగులు 19 రోజులుగా పోరాడుతుంటే యాజమాన్యం పంతానికి పోయి, రోగులను, వైద్య కళాశాల విద్యార్థులను గాలికి వదిలేసి, మొండిగా వ్యవహరించడాన్ని ఖండించారు. జిల్లా కలెక్టర్, కార్మిక శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రమణమ్మ, జగన్మోహన్, రమణ, ఆనంద్, రవి, హరీష్, లక్ష్మి , త్రినాథ్, భారతి, రమణమ్మ, లక్ష్మి, ప్రభా, రమేష్, రాజు, మణి, అంజలి, సంధ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : మిమ్స్ ఉద్యోగుల పోరాటానికి మద్దతుగా స్థానిక జయంతి కాలనీ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, మండల నాయకులు కనకరాజు, గోవింద, ఏసు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : మిమ్స్ ఉద్యోగులకు మద్దతుగా స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి.శ్రీనివాసరావు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బొబ్బిలి : మిమ్స్ ఉద్యోగులకు మద్దతుగా చర్చి సెంటర్లో సిఐటియు ఆధ్వర్యాన రాస్తారోకో నిర్వహించారు. మిమ్స్ ఉద్యోగులను తొలగించడం దుర్మార్గమని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు అన్నారు. అన్యాయంగా తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని, వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. మిమ్స్ ఉద్యోగుల పోరాటానికి మద్దతు ఇస్తామని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మణికుమార్ చెప్పారు. కార్యక్రమంలో మోటారు కార్మికులు పాల్గొన్నారు.

బాడంగి : మిమ్స్ ఉద్యోగులకు మద్దతుగా బాడంగిలో సిఐటియు జిల్లా నాయకులు ఎ.సురేష్ ఆధ్వర్యాన రాస్తారోకో నిర్వహించారు.

శృంగవరపుకోట : మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, జిల్లా నాయకులు చెలికాని ముత్యాలు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఎం.హర్ష, నాయకులు రమేష్, రిషి తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. నెల్లిమర్లలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 19 రోజులుగా మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు సమస్యలు పరిష్కరించాలని విధులు బహిష్కరించి నిరసన చేస్తుంటే యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోక పోవడం దుర్మార్గమన్నారు.

శృంగవరపుకోట, బొబ్బిలిలో రాస్తారోకో నిర్వహిస్తున్న సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు

రాజాం బస్ కాంప్లెక్సును ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

తక్షణమే సంక్షేమ ఫలాలు

మంత్రి బొత్స • రాజాంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

ప్రజాశక్తి-రాజాం

అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా పూర్తి చేసి, వాటి ఫలాలను తక్షణం అందించడమే తమ ప్రభుత్వ విధానమని విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. రాజాం పట్టణంలోని ఆదర్శనగర్, డోలపేటల్లో ఒక్కోటి రూ.80 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, రూ.1.08 కోట్లతో నిర్మించిన సబ్ ట్రెజరీ కార్యాలయ భవనాన్ని, రూ.కోటిన్నరతో నిర్మించిన రాజాం బస్ కాంప్లెక్స్‌ను మంత్రి సోమవారం ప్రారంభించారు. బస్ కాంప్లెక్స్ వద్ద జరిగిన సభలో బొత్స మాట్లాడుతూ సుమారు ఆరు నెలల్లోనే బస్ కాంప్లెక్స్ పూర్తి చేసినందుకు అభినందించారు. త్వరలో రాజాంలో బస్ డిపో కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రతిపక్ష నాయకులు తమను, తమ ప్రభుత్వ కార్యక్రమాలను విమర్శించడానికి పరిమితం కాకుండా, ప్రజల కోసం ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఇష్టానుసారం మాట్లాడటం సరికాదని, పెద్దా చిన్నా తేడా చూసుకొని మాట్లాడాలని హితవు పలికారు. అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడారు. కార్యక్రమాల్లో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు, జోనల్ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ తలే రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి : గొర్రెలు, మేకల పెంపకం దారులు 699 మందికి రూ.24 లక్షలు విలువైన వలలు, టార్చ్ లైట్లు, రెయిన్ కోట్లను చీపురుపల్లిలో మంత్రి బొత్స సత్యనారాయణ పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ నుంచి సుమారు రూ.16.70 లక్షలు సమకూర్చగా, మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారులు చెల్లించారు. వృత్తిదారులకు సహకార రుణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ వివిధ రకాల కుల వృత్తులను సంరక్షించడానికి, వృత్తిదారులను ఆదుకోవడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా గొర్రెలు, మేకల పెంపకం దారులకు ఉపకరణాలు పంపిణీ చేయడానికి ప్రణాళికను రూపొందిస్తున్నామని చెప్పారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎంపి బెల్లాన చంద్ర శేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ జెడి డాక్టర్ విశ్వేశ్వరరావు, డిడి డాక్టర్ వై.వి.రమణ, ఎంపిపి ఇప్పిలి వెంకట నరసమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష పాల్గొన్నారు.

జెకెసికి 182 వినతులు

అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జగనన్నకు చెబుదాంలో వివిధ సమస్యలపై ప్రభుత్వ శాఖలకు ప్రజల నుంచి అందిన వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వాటిని సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. ఆయా ప్రభుత్వ శాఖలు తమకు సంబంధించి ఆన్‌లైన్‌లో పంపిన వినతులను పరిశీలించి వాటిపై స్పందించాలన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో డిఆర్ఒ ఎస్.డి.అనిత, కెఆర్ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ సుమబాల, మురళీకృష్ణ, సిపిఒ బాలాజీ, మెప్మా పీడీ సుధాకర్‌రావుతో కలిసి జిల్లా కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 182 వినతులు అందాయి. రెవెన్యూ శాఖ సమస్యలపై 129, డిఆర్‌డిఎకు సంబంధించి 11, గ్రామ వార్డు సచివాలయాల శాఖకు 12, జిల్లా పంచాయతీ విభాగానికి 7, గృహనిర్మాణ శాఖకు 7, జిల్లా ఆసుపత్రులకు సంబంధించి 3, ఎపి విద్యుత్ పంపిణీ సంస్థకు 3 వినతులు, మున్సిపల్ శాఖకు 10 చొప్పున వినతులు అందాయి.

మా పొట్ట కొట్టనివ్వొద్దు

తమ గ్రామంలోని గంగులవానిచెరువులో దుస్తులు ఉతుకుతూ, సర్వే నంబరు 105/2 లోని మెట్ట, పోరంబోకు స్థలంలో ఆరబెట్టుకుని జీవనం సాగిస్తున్నామని వేపాడ మండలం బొద్దాం గ్రామానికి చెందిన పైడిమాంబ రజక సంఘం అధ్యక్షులు ఆర్.చిట్టిబాబు తెలిపారు. అక్కడ కొంతమంది రాజకీయ లబ్ధి కోసం ఆ స్థలంలో ఇళ్ల కోసం రాళ్లు పాతి ఇస్తామంటున్నారని, అలా చేస్తే తమ జీవనోపాధి కోల్పోతామని, సంఘం పేరుతో పట్టాలిప్పించాలని చిట్టిబాబు ఆధ్వర్యాన సభ్యులు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

దుర్వాసనతో నరకం

పూసపాటిరేగ మండలం చోడమ్మ అగ్రహారం గ్రామ సమీపాన ఉన్న సిపిఎఫ్ పరిశ్రమ నుంచి దుర్వాసన విపరీతంగా వస్తోందని, రాత్రివేళ నిద్ర పట్టడం లేదని ఆ గ్రామస్తులు కలెక్టర్‌కు వినతి అందించారు. కంపెనీ వ్యర్థాలను నేరుగా చెరువులోకి వదిలేయడంతో భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయని చెప్పారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆక్రమణలు తొలగించాలి

కేంద్రమాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇన్నర్ రింగ్‌రోడ్డు ఇరువైపులా ఉన్న చిన్న దుకాణాలను నేడు షాపులుగా మార్చి, స్థిర నివాసాలు ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారని, వెంటనే ఆక్రమణలను తొలగించాలని టిడిపి జిల్లా ప్రధానకార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు పి.లక్ష్మీవరప్రసాద్, కనకల మురళీమోహన్.. కలెక్టర్‌కు వినతి అందించారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

నగరంలోని విటి అగ్రహారం పరిధిలో సర్వే నంబరు 114/1లో ప్రభుత్వ భూమిని కాపాడాలని జనసేన నాయకులు రౌతు సతీష్.. గ్రీవెన్స్‌లో వినతి అందించారు. బట్టల మిల్లు, జూట్‌మిల్ మూతపడటంతో లేఅవుట్ల పేరుతో అధిక ధరకు ప్రయివేట్ కంపెనీలు అమ్ముకోవడానికి చూస్తున్నాయని తెలిపారు. గతంలో స్థానికుల నుంచి ప్రభుత్వం ఆ భూమిని సేకరించిందని గుర్తుచేశారు. వెంటనే స్పందించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని, విటి అగ్రహారం వాసులకు సామాజిక భవనం, ఇతర అవసరాలకు కేటాయించాలని కోరారు.

ఆటో డ్రైవర్లపై ఆర్థిక దాడి ఆపాలని వినతి

విజయనగరం టౌన్ : ఆటో డ్రైవర్లపై ఆర్థిక దాడిని ఆపాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ జగన్మోహనరావు, ఆటో యూనియన్ నాయకులు రామారావు ఆధ్వర్యాన జగనన్నకు చెబుదాంలో కలెక్టర్‌కు వినతి అందించారు. రవాణా రంగ వాహనదారులు, ఆటో డ్రైవర్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక దాడికి పాల్పడి తమ ఖజానాను నింపుకుంటున్నాయని చెప్పారు. పెట్రోల్, డీజిల్ ధరలతోపాటు బ్రేక్ రెన్యువల్ ఫీజులు, పెనాల్టీలు విపరీతంగా పెరిగాయని ఆందోళన వ్యక్తంచేశారు. కార్పొరేషన్‌లో సిగ్నల్ స్టాప్ లైన్ వైలేషన్ పేరుతో రూ.300 పెనాల్టీ వసూలు చేస్తున్నారని చెప్పారు. దీన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో భాస్కర్ రావు, ఆనంద్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శంఖారావంలోనూ తేలని లెక్క

- తెలుగు తమ్ముళ్లలో గందరగోళం
- ఆశావహులకూ తప్పని ప్రయాస
- దగ్గర పడుతున్న ఎన్నికలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో లోకేష్ శంఖారావం సభలు జరిగిన సంగతి తెలిసిందే. కొన్నిచోట్ల తెలుగు తమ్ముళ్లు అత్యంత ఉత్సాహంగా సభలకు హాజరు కాగా, పాలకొండ, బొబ్బిలి, సాలూరు, విజయనగరం తదితర నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన సభలు చివరి వరకు జనం లేకపోవడంతో వెలవెలబోయాయి. దీంతో ప్రాంగణాలు నిండేవరకు లోకేష్ అక్కడే నిరీక్షించి, అనంతరం వేదికపైకి వచ్చి మాట్లాడాల్సి వచ్చింది. అంతమాత్రాన ఆయా నియోజకవర్గాల్లో సభకు కూడా హాజరు కాలేనంత తక్కువ కేడర్ ఉందని చెప్పలేం. వారిని సమయానికి రప్పించడంలో ఆయా నియోజకవర్గాలకు చెందిన నాయకులు విఫలమయ్యారని చెప్పుకోవచ్చు. గజపతినగరం, రాజాం, చీపురుపల్లి తదితర సభల్లో జనం పోటెత్తారు. ఈ సంగతి కాస్త అటుంచితే... ఓవైపు ఎన్నికలు దగ్గర పడుతుండడం, మరోవైపు ఎక్కువ నియోజకవర్గాల్లో గ్రూపులపోరు తారా స్థాయికి చేరుకుంది. దీంతో లోకేష్ చేపట్టిన శంఖారావం సభల్లో అభ్యర్థులను ప్రకటించకున్నా... పార్టీ కేడర్‌కు పరోక్షంగా సంకేతాలు ఇస్తారనే చర్చ ముందస్తుగా సాగింది. అటువంటి పరిణామాలేవీ శంఖారావం సభల్లో కనిపించలేదు. దాదాపు అన్ని చోట్లా పార్టీ ఇన్‌ఛార్జులు అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్యేలు, ఇతర పెద్దలను కూడా కూర్చోబెట్టారు. దాదాపు అన్ని చోట్లా పార్టీ నాయకులందర్నీ కలుపుకునే రీతిలోనే లోకేష్ ప్రసంగం గానీ, పలకరింపు తీరు గానీ కనిపించింది. అయినా, ఎన్నికల గుర్రం ఎవరనేది ఊహకు కూడా అందనివ్వక పోవడంతో దాదాపు అన్ని గ్రూపుల్లోనూ నిస్తేజం కనిపిస్తోంది.

విజయనగరం నియోజకవర్గంలో పూసపాటి అశోక్ గజపతి గానీ, ఆయన కుమార్తె, నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతి గానీ.. మాజీ ఎమ్మెల్యే మీసాల గీత పేరు ప్రస్తావించడానికి కూడా ఇష్టపడలేదు. లోకేష్ మాట్లాడినప్పుడు గీత హయాంలో అభివృద్ధి జరిగిందని కితాబిచ్చారు. విజయనగరం అసెంబ్లీ స్థానాన్ని అశోక్ లేదా ఆయన కుమార్తె పంచుకున్నట్టుగా వ్యవహరిస్తే బిసికి చెందిన గీత పరిస్థితి ఏమిటో? అంటూ చాలా వరకు చర్చ నడుస్తున్నప్పటికీ క్లారిటీ ఇవ్వలేదు. చీపురుపల్లిలో మంత్రి బొత్సను ఎలాగైనా ఓడించాలనే లక్ష్యంతో ధీటైన అభ్యర్థిని రంగంలోకి దింపుతారని పార్టీ నాయకుల్లో సైతం ప్రచారం జరుగుతోంది. కానీ, శంఖారావం సభలో కిమిడి నాగార్జునకు మించిన నాయకులెవరూ కనిపించలేదు. నెల్లిమర్ల స్థానం టిడిపికా, జనసేనకా అన్న సందేహం ఇరు పార్టీల కేడర్‌నీ వీడలేదు. శృంగవరపుకోటలో సీటు కోసం స్థానిక మాజీ ఎమ్మెల్యే, మరో నేత గొంప కృష్ణ పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో శంఖారావం సభలో ఇరు గ్రూపులకు చెందిన నాయకులు, ముఖ్య కార్యకర్తలకు మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. గజపతినగరంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు, స్థానిక నాయకుడు కరణం శివరామకృష్ణతోపాటు కొద్దికాలంగా సీటు ఆశిస్తున్న కె.ఎ.నాయుడు అన్న కుమారుడు శ్రీనివాసరావుకు కూడా సభలో పాల్గొనే అవకాశం కల్పించారు. దీంతో, అభ్యర్థి ఎవరు? అనే సందేహం యథాతథంగానే ఉండిపోయింది. సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ, నెల్లిమర్ల నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది.

ప్రతిభా భారతి గైర్హాజరు వెనుక ఆంతర్యమేమిటో?

రాజాం నియోజకవర్గంలో మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, ఆమె కుమార్తె గ్రీష్మ గైర్హాజరు కావడం పట్ల సర్వత్రా చర్చ నడుస్తోంది. కొన్నాళ్ల క్రితమే పార్టీలోని ఓ రాష్ట్ర నాయకుడి కనుసన్నల్లో ప్రతిభా భారతి ఆధ్వర్యాన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోండ్రు మురళికి వ్యతిరేకంగా నాలుగు మండలాలకు చెందిన నాయకులు రహస్య సమావేశమయ్యారు. ఆ సమావేశంలో పాల్గొన్న మండల నాయకులు హాజరైనప్పటికీ ప్రతిభా భారతి, గ్రీష్మ హాజరు కాకపోవడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా ఉంది.

కార్మికుల ఆరోగ్య భద్రతకు 'నమస్తే'

కమిషనర్ ఎం.ఎం.నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రత, జీవన విధానం మెరుగుదలకు నమస్తే కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.ఎం.నాయుడు వెల్లడించారు. సోమవారం నమస్తే కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సెప్టిక్ క్లీనర్స్, వాహన యజమానులు, పనిచేసే సిబ్బంది వివరాలను నమోదు చేసే ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సెప్టిక్ క్లీనర్లు, యజమానులు, కార్మికులు ఆరోగ్య భద్రత పరిరక్షణ కోసం నమస్తే కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, శానిటేషన్ సూపర్‌వైజర్ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శిగా శ్యామ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన డి.శ్యామ్ ఎన్నికయ్యారు. ఇటీవల భీమవరంలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఆయన్ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

విజయం కోసం కలిసి పనిచేద్దాం

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ • పార్టీలోకి అవనాపు, గాడు, పిల్లాను ఆహ్వానించిన అశోక్ , కళా

అవనాపు విజయ్‌కి టిడిపి కండువా కప్పుతున్న పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరం కోట

వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం పార్టీ శ్రేణులంతా కలిసి పనిచేద్దామని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్‌గజపతిరాజు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక అశోక్ బంగ్లాలో అవనాపు విజయ్, పిల్లా విజయ్‌కుమార్, గాడు అప్పారావు ఆధ్వర్యాన పలువురు నాయకులు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. ఆయా డివిజన్ కేంద్రాల నుంచి కార్యకర్తలతో కలిసి వారు భారీ ర్యాలీగా బయల్దేరి అశోక్ బంగ్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారికి అశోక్‌తోపాటు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావు పార్టీ కండువా కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్ నుంచి తనను తప్పించడానికి ఎక్కడెక్కడ నుంచో తీసుకొచ్చి పెట్టారని, ఆ సందర్భంలో 470 మంది పిల్లలకు 16 నెలలు భోజనాలు అందకుండా చేసిన ఘనత ఇక్కడి ఎమ్మెల్యేదేనని విమర్శించారు. సిగ్గువిడిచి తాగుబోతులు, దొంగ వ్యాపారాలు చేసేవారు నేడు నీతులు చెబుతున్నారని ఎద్దేవాచేశారు. వేల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్న అరుణా జ్యూట్‌మిల్, సర్వరాయి టెక్స్‌టైల్స్‌ను తానే కొని తిప్పుతానన్న పెద్దమనిషి ఈరోజు వ్యాపారాలు చేసుకుంటున్నారని చెప్పారు. అనంతరం కళావెంకట్రావు మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వ్యక్తులను పట్టించుకోకుండా, నిర్లక్ష్యం చేసిన వారు ఇంతకంటే ఏం దిగజారి పోతారని ప్రశ్నించారు. రాజ్యాంగ వ్యతిరేక పరిపాలన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలు నచ్చక వైసిపిని వీడే వారి సంఖ్య పెరుగుతోందని చెప్పారు. అనంతరం టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున, విజయనగరం, బొబ్బిలి, గజపతినగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జులు అదితి గజపతిరాజు, బేబినాయన, కెఎ నాయుడు మాట్లాడారు. టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, బిసి సెల్ నాయకులు వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, కనకాల మురళీమోహన్, కర్రోతు నర్సింగరావు, విజ్జపు ప్రసాద్, ముద్దాడ చంద్రశేఖర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసిపి గెలుపును ఏ ఒక్కరూ నిలువరించలేరు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి గెలుపును ఏ ఒక్కరూ నిలువరించలేరని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి వ్యాఖ్యాని ంచారు. సోమవారం నగరంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద వైసిపి నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న సీనియర్ సిటిజన్లతో భారీ స్థాయిలో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యకర్తలే పార్టీకి బలమని, బూత్ కమిటీ చురుకైన పాత్రను పోషించాలని చెప్పారు. పారదర్శకంగా పనిచేయడం ద్వారానే ఎన్నికల్లో గెలవవచ్చన్నారు. ఎక్కడా ఏమరుపాటు వద్దని సూచించారు. టిడిపి నాయకులు దిగజారుడు రాజకీయాలను ఇప్పటికైనా మానుకొని, ప్రజలను హుందాగా ఓటు అడిగే పరిస్థితి రావాలన్నారు. మంగళవారం సోనియానగర్‌లో టిడ్కో గృహాలను మంత్రి బొత్స సత్యనారాయణ పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. 25న బిసి కాలనీలో వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అయ్యన్నపేట, దుప్పాడ రహదారిని, నెహ్రూ చిల్డ్రన్ పార్కును ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, మండల అధ్యక్షులు మామిడి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి కెల్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

నియోజకవర్గ పరిధిలో 15 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద చెక్కులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అందజేశారు. 15 మందికి మంజూరైన రూ.28.64 లక్షల చెక్కులను అందజేశారు.

వాలంటీర్ల వల్లే ప్రభుత్వానికి పేరు

ప్రజాశక్తి - చీపురుపల్లి

గ్రామ, వార్డు వాలంటీర్ల వల్లనే ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులుగా తమకు మంచి పేరు వచ్చిందని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వాలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డుల ప్రధానం కార్యక్రమంలో ఎంపిపి ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీషలతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసే ప్రతీ సంక్షేమ పథకాన్ని ప్రజలకు చేరువ చేయడంలో వాలంటీర్లు కీలక పాత్ర వహించారన్నారు. రాబోయే రోజులలో కూడా ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా సంక్షేమ పథకాలను ప్రజలకు అందే విధంగా చూడాలని వాలంటీర్లకు ఛైర్మన్ సూచించారు. అనంతరం వాలంటీర్లకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసరావునాయుడు, ఎఎంసి ఛైర్మన్ దన్నాన జనార్దనరావు, చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైసిపి జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ,

జిల్లా పరిషత్తు ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: వాలంటీర్లకు పురస్కారాలను అందిస్తున్న జిల్లా పరిషత్తు ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

కనకమహాలక్ష్మి ఆలయ కమిటీ ఛైర్మన్ ఇప్పిలి గోవిందరావు, మండలంలో గల అన్ని గ్రామాల సర్పంచ్‌లు, పాల్గొన్నారు.

మెరకముడిదాం: ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి కష్ట సుఖాలు తెలుసుకొని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయటంలో గ్రామ వాలంటీర్ల సేవలు వెల కట్టలేనివని ఉత్తరాంధ్ర జిల్లాల డిప్యూటీ రీజినల్ కో-ఆర్డినేటర్, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన వాలంటీర్ల సేవా పురస్కార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో మొత్తం 311 మంది వాలంటీర్లు ఉండగా ఐదుగురికి సేవారత్న పురస్కారాలు కింద ఒక్కొక్కరికి రూ. 30వేలు చొప్పున మిగిలిన 306 మందికి సేవామిత్ర కింద ఒక్కొక్కరికీ రూ.15వేలు చొప్పున ప్రభుత్వం వారి అకౌంట్లలో వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తాడ్డి కృష్ణవేణి, వైసిపి నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, ఎస్‌వి రమణరాజు, కోట్ల వెంకటరావు, రాము, పప్పల క్రిష్ణ మూర్తి, బూర్లె నరేష్ కుమార్, రాజాం నియోజక వర్గ వైసిపి పరిశీలకులు కె.వి సూర్యనారాయణరాజు, ఎంపిడిఒ ఎం.పావని పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు అమోఘం

బొబ్బిలి: వాలంటీర్ల సేవలు ఆమోఘమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక శ్రీకళాభారతిలో సోమవారం గ్రామ వార్డు వాలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందించడంలో వాలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. టిడిపి హయామంలో జన్మభూమి కమిటీలతో అక్రమాలకు పాల్పడితే వైసిపి హయామంలో వాలంటీర్ వ్యవస్థతో అవినీతికి చోటు లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మి, వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల్, తమ్మిరెడ్డి దామోదర్, ఎంపిడిఒ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ ఎంపిడిఒగా ఉమ

ప్రజాశక్తి - వేపాడ

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపిడిఒ ఉమ

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒగా జి.ఉమ పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడే ఇఒపిఆర్‌డిగా పనిచేసిన ఆమె ఇక్కడ ఎంపిడిఒ పట్నాయక్ బదిలీ తరువాత ఇంఛార్జి ఎంపిడిఒగా ఉండేవారు. సోమవారం ఆమె పూర్తి స్థాయి ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె కార్యాలయ సిబ్బందితోనూ, 18 గ్రామ పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో పారదర్శకంగా ఉండాలన్నారు.

సేంద్రియ బెల్లం కొనుగోలు చేయండి

ప్రజాశక్తి- బొబ్బిలి

చెరకు రైతులు తయారు చేస్తున్న సేంద్రీయ బెల్లం కొనుగోలు చేసి రైతులకు అండగా ఉండాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ అన్నారు. కోమటిపల్లిలో ఏర్పాటు చేసిన సేంద్రీయ బెల్లం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించి బెల్లం కొనుగోలు చేశారు. లచ్చయ్యపేట చక్కెర పరిశ్రమ మూతపడడంతో చెరకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోమటిపల్లి రైతులు రసాయనాలు వాడకుండా తయారు చేస్తున్న సేంద్రీయ బెల్లం కొనుగోలు చేయాలని కోరారు.

మీడియాపై దాడులు అరికట్టాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వినతి పత్రాన్ని అందిస్తున్న విలేకర్లు

అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం సీఎం జగన్మోహన్ రెడ్డి 'సిద్ధం' సభకు విధి నిర్వహణలో భాగంగా ఫోటోలు తీసేందుకు వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై కొంతమంది దారుణంగా దాడి చేసిన సంఘటన నెల్లిమర్ల ప్రెస్ క్లబ్ తీవ్రంగా ఖండిస్తూ ప్రెస్ క్లబ్ సభ్యులు సోమవారం డిప్యూటీ తహశీల్దార్ డి శైలజను కలిసి వినతి పత్రం అందజేశారు. నిందితులపై తక్షణమే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ తరహా దాడులు భవిష్యత్తులో పునరావృతం కాకుండా నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాళ్ల శ్రీనివాసరావుతో పాటు విలేకర్లు ఆరిపాక రాము, రమణ, శ్రీను, సీతారాం, శనపతి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక శివాలయం వద్ద సోమవారం నేను సైతం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. పేదలకు ఆకలి తీర్చేందుకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు బొంగు సంతోష్, లంక వాసు అన్నారు. పేదలకు అండగా ఉండాలని కోరారు.

జాకేరులో సోషల్ ఆడిట్ సభ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో జాకేరులో 2022 నుంచి 2023 సంవత్సర కాలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను సోషల్ ఆడిట్ టీం గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించింది. వేతనదారులకు ఇచ్చిన వేతనాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ పరిశీలనలో సోషల్ ఆడిట్ టీం డిఆర్‌పి వెంకటరావు, ఎపిఒ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతోనే దేశ ప్రగతి

ప్రజాశక్తి - బొబ్బిలి

సాంకేతిక విద్యతోనే దేశం అభివృద్ధి చెందుతుందని శ్రీలక్ష్మమ్మ మెమోరియల్ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ డాక్టర్ రెడ్డి సత్యారావు అన్నారు. సోమవారం స్థానిక సాయిలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విద్యార్థుల ఫేర్వెల్ ఫంక్షన్‌కు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు విద్య పట్ల శ్రద్ధ పెట్టాలని మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం ప్రిన్సిపాల్ బల్లమూడి రవిచంద్ మాట్లాడుతూ తమ కళాశాలలో చదివిన విద్యార్థులు ఎంతో ఉన్నత స్థానాలకు ఎదిగారని, మీరు కూడా అదే స్థాయిలో ఉండి మంచి ఉద్యోగాలు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాగాల దమయంతి, ఉపాధ్యాయుడు బిహెచ్ఎస్ఎస్ సాయిబాబా, ఉపాధ్యాయులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పలు భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని ఎ.రావివలస పంచాయతీలో మంగళవారం సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్లను ప్రారంభిస్తామని సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఈ భవనాలను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

బకాయి జీతాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి- బాడంగి

స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్లు తమకు బకాయి ఉన్న జీతాలివ్వాలని సోమవారం ధర్నా చేశారు. సిఐటియు జిల్లా నాయకులు ఎ.సురేష్ మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ కల్లా గ్రీన్ అంబాసిడర్లు జీతాలు చెల్లించకపోతే సిఐటియు ఆధ్వర్యంలో ఎంపిడిఒ ఆఫీస్‌కి తాళాలు వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కొత్తవలస

స్థానిక పిహెచ్‌సిలో వైద్యాధికారి సీతల్ వర్మ ఆధ్వర్యంలో మార్చ్ 3న జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిహెచ్‌ఒ కృప తెలిపారు. పిహెచ్‌సిలో సోమవారం బూత్ లెవెల్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిహెచ్‌సి పరిధిలో 25 బూతుల్లో అప్పుడే పుట్టిన పిల్లలు నుండి 5 సంవత్సరాలు పిల్లలు 4,027 మందికి పోలియో చుక్కలు వేస్తామని తెలిపారు, కొత్తవలస రైల్వే స్టేషన్, ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో కూడా బూత్ లెవెల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. వాక్సిన్ వివిఎమ్ పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై అంగన్వాడీ, ఏఎన్ఎం, ఎంఎల్‌పిహెచ్, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో పి.హెచ్ఎన్ రమణమ్మ, సూపర్‌వైజర్స్ సూరిదేముడు, బేబీరాణి, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, శేషుబాబు, కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అగరుబత్తి యూనిట్‌ను సందర్శించిన డిజిఎం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని రామతీర్థంలో అగరుబత్తి యూనిట్‌ని నాబార్డ్ డిజిఎం పణికర్ సోమవారం పరిశీలించారు. నాబార్డ్ సౌజన్యంతో గత సంవత్సరం జనవరి 30 మంది సంఘ సభ్యులకి రామతీర్థం దేవాలయంలో వాడిన పువ్వులు చేత అగరుబత్తీ, దూప్‌స్టిక్స్ శిక్షణ ఇచ్చి ఈ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ యూనిట్‌ను ఆమెతో పాటు డిడిఎం నాగార్జున పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ ఎపిడి కె.సావిత్రి, గరివిడి ఏరియా కో ఆర్డినేటర్ బి.బంగారమ్మ, ఎపిఎంలు, సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

'రాజకీయాలతో మా కడుపులు కొట్టొద్దు'

ప్రజాశక్తి - కొత్తవలస

నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

మండలంలోని సంతపాలెం గ్రామానికి చెందిన దళితులు తమకు ఉపాధి పని కల్పించి ఆదుకోవాలని ఎంపిడిఒకు సోమవారం విన్నవించారు. సిపిఎం నాయకుడు గాడి అప్పారావు ఆధ్వర్యంలో సోమవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి వినతిపత్రం అందించారు. గ్రామంలో వైసిపి, టిడిపి వర్గాల మధ్య విభేదాలు తమ కులస్తుల పొట్ట కొడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ఏ పార్టీతో నిమిత్తం లేదని, తమ పొట్ట కొట్టవద్దని దళితులు ఆందోళన చేపట్టారు. తమకు రెండు రోజులు పని చెప్పి మూడవ రోజు నుంచి పని ఆఫ్ చేశారని దళితులు ఆందోళన వ్యక్తం చేశారు.

నేటి నుంచి జిందాల్ నిర్వాసితుల దీక్షలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

బొడ్డవర నుండి తాటిపూడికి వెళ్ళే జాతీయ రహదారిలో గల జిందాల్ కార్యాలయం వద్ద జిందాల్ నిర్వాసితులు మంగళవారం నుంచి నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు నిర్వాసిత రైతులు సోమవారం తెలిపారు. ముందుగా వారు బొడ్డవరలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుని తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నిర్వాసిత రైతులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో జిందాల్ అల్యూమినా కర్మాగారం వస్తుందని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఉపాధి కలుగుతుందనే ఆలోచనతో తమ భూముల్ని జిందాల్‌కు అప్పగించడానికి అంగీకరించామన్నారు. కంపెనీ ప్రకటించిన ప్యాకేజీకి సంబంధించి, నగదు, షేర్లు తమకు ఇస్తామని నమ్మించి, ఈరోజు అమాయకులైన గిరిజనులు, దళితులు, ప్రజలను మోసం చేసే స్థితికి యాజమాన్యం వచ్చిందన్నారు. కంపెనీ ఏర్పాటు కోసం సేకరించిన భూములలో జిందాల్ యాజమాన్యం ఆధ్వర్యంలో అల్యూమినా కర్మాగారానికి బదులు ఎంఎస్ఎంఇ పార్కు నిర్మాణానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా పార్కు నిర్మాణం చేపట్టే ముందు అందులో ఏర్పాటు చేయబోయే కంపెనీల వివరాలు ప్రజలకు తెలియజేయాలన్నారు. పార్కులో ఏర్పాటు చేయబోయే కంపెనీల విషయమై విధివిధానాలను రైతులకు వివరించే విషయమై 45 రోజుల క్రితం సమావేశం ఏర్పాటు చేయాలని జిందాల్ సిఇఒ కనకారావుని కోరామన్నారు. కానీ నేటి వరకూ ఎటువంటి చర్యలూ చేపట్టనందుకు గాను, నిరసనగా మంగళవారం నుండి జిందాల్ నిర్వాసితులు అందరూ నిరాహార దీక్షలు చేపడుతున్నామని ఎమ్మెల్సీకు తెలియజేశారు.

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం

ప్రజాశక్తి - కొత్తవలస

రానున్న ఎన్నికల్లో టిడిపి రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని, వైసిపి ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరిది అభివృద్ధి పాలనో, ఎవరిది విధ్వంస పాలనో ప్రజలకు తెలుసని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై చర్చించేదుకు వైసిపి నాయకులు సిద్ధం కావాలన్నారు. 2019లో ప్రజలు ఇచ్చిన ఒక్క చాన్సే జగన్‌కు రాజకీయంగా చివరి చాన్స్ అని గుర్తు పెట్టుకోవాలన్నారు. వందల కోట్లు ఖర్చు చేస్తూ అధికార దుర్వినియోగంతో సిద్ధం అని సభలు పెడుతున్నారని విమర్శించారు. దేశంలో అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా మారిన జగన్‌కు పేదల జీవితాల గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని ఎద్దేవా చేశారు. సామాజిక న్యాయం అనే పదం పలికే అర్హతే జగన్ రెడ్డికి లేదన్నారు. టిడిపి తెచ్చిన 120 సంక్షేమ పథకాలను జగన్ రెడ్డి రద్దు చేశారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బీసీ, మైనారిటీ సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్ల రూపాయలు దారి మళ్లించారని విమర్శించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు బొబ్బిలి అప్పారావు మాస్టారు, యల్లపు సూరిబాబు, కనకాల శివ, బంగారు రమేష్, లెంక శ్రీను, నక్కరాజు రాము, గుమ్మడి మహేష్, భీశెట్టి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు రాష్ట్రంలోని ప్రజలు సిద్ధంగా ఉన్నారని నెల్లిమర్ల నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ కర్రోతు బంగార్రాజు అన్నారు. పోలిపల్లిలో ఆయన సోమవారం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓడిపోతామని ఉద్దేశంతో 77 మంది ఎమ్మెల్యేలను మడత పెట్టారని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో మిగతా వారిని జనం మడత పెడతారని ఎద్దేవా చేశారు. ప్రజలకు పది రూపాయలు ఇచ్చి వంద రూపాయలు దోచుకుంటున్న వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు.

ఆలోచింపజేసిన సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ పల్లవి

గురజాడ పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఎంతో ఆలోచింపజేసింది. వివిధ అంశాలపై విద్యార్థులు రూపొందించిన నమూనాలు, అందులో సృజనాత్మకత, చొరవ 'నేటి బాలలే రేపటి సైంటిస్టులు, ఇంజినీర్లు' అన్న సూక్తికి అద్దం పట్టాయి. ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల పండ్లు, కూరగాయలు వాటిలో ఉండే పోషకాలు తెలియజేయడం వంటి సాధారణ అంశాలతోపాటు వ్యవసాయం, పాడి, మత్స్య సంపద సృష్టించడం వరకు, సాగునీటి ప్రాజెక్టులు, యుద్ధవిన్యాసాలు, అంతరక్ష ప్రయాణాల్లో సాంకేతిక అంశాలను ప్రతిబింబిస్తూ విద్యార్థులు తమ నమూనాలను ప్రవేశపెట్టారు. వీటిని పాఠశాల విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు కూడా తిలకించారు. ఈ కార్యక్రమానికి సెంచూరియన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలు నమూనాల ప్రదర్శనతోపాటు వాటి గురించి విద్యార్థులు వివరించే తీరునుచూసి ఆమె అబ్బురపోయారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తమ నమూనాలను ప్రదర్శనలో పెట్టారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఎం.స్వరూప, ప్రధానోపాధ్యాయులు శేఖర్ పాల్గొన్నారు.

వైస్ ఎంపిపి భూ ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

వైస్ ఎంపిపి నల్లపురాజు సత్యనారాయణరాజు సుమారుగా 100 ఎకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించారని చోడమ్మ అగ్రహారం మాజీ సర్పంచ్ నల్ల అప్పలరాజుతోపాటు జి.చోడవరం గ్రామస్తులు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలో జి. చోడవరం, చోడమ్మ అగ్రహారం, పోరాం రెవెన్యూ పరిధిలో కొండపోరంబోకు, గయాలి, పశువులుబీడు, రస్తాలను యథేచ్ఛగా ఆక్రమించారన్నారు. ఆ భూముల్లో ప్రభుత్వం సబ్సీడీలు, విద్యుత్ లైన్ వేసుకొని ధర్జాగా అనుభవిస్తున్నారన్నారు. ఆ భూములను వెంటనే ప్రభుత్వం స్వాదీనం చేసుకొని ప్రజలకు పంచాలని కోరారు. ఈ విషయమై కలెక్టర్ నాగలక్ష్మి స్పందించి ఆర్‌డిఒను పరిశీలించాలని సూచించినట్లు తెలిపారు. అనంతరం పూసపాటిరేగ తహశీల్దార్‌కు ఆక్రమణపై వినతి ఇచ్చారు. ఆమె కూడా సర్వేయర్ గణపతిరావును పలిపించి వెంటనే ఆయా భూములు స్థితిని తెలియజేయాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌కు మాజీ సర్పంచ్ అప్పలరాజుతో పాటు గ్రామస్తులు గనమాని అప్పన్న, నల్ల రామసత్యం, నల్ల ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

ఒక్కసారి అవకాశమివ్వండి

ప్రజాశక్తి- చీపురుపల్లి

ఎమ్మెల్యేగా తనకు ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని టిడిపి నియోజక వర్గం ఇంచార్జి కిమిడి నాగార్జున అన్నారు. చీపురుపల్లి పంచాయతీ పరిధిలోని వంగపల్లి పేటలో సోమవారం రాత్రి ఆయన ఇంటింటికి వెళ్లి టిడిపి ప్రకటించిన మేనిఫెస్టోని ప్రజలకు వివరించారు. టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు విసినిగిరి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు రౌతు కాము నాయుడు, ముల్లు రమణ, గవిడి నాగరాజు, రౌతు నారాయణరావు, వెంపడాపు లక్ష్మునాయుడు ఇల్లాపు ఆదిబాబు, వెంపడాపు శాంతారావు, రెల్లి తాతారావు, లింగాల అప్పారావు, వెంపడాపు సత్యన్నారాయణ, రేగిడి మహేష్, సబ్బి సోనియా, రెడ్డి లక్ష్మణరావు, పిన్నింటి దుర్గారావు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కావాలని వినతి

ప్రజాశక్తి - భోగాపురం

అధికారికి వినతి పత్రాన్ని అందిస్తున్న నాయకులు, గ్రామస్తులు

అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కొత్త చెరుకుపల్లి గ్రామస్తులు తహశీల్దార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. తమ గ్రామంలో టిడిపి హయామంలో ఇళ్ల పట్టాలు ఇచ్చారు కానీ స్థలాలు చూపించలేదన్నారు. న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్న వారికి మాత్రం న్యాయస్థానం ఆదేశాల మేరకు ఇళ్ల స్థలాలు ఇస్తున్నారని చెప్పారు. జగనన్న కాలనీలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇంకా ఇళ్ల స్థలాలు మంజూరు కాలేదని చెప్పారు. అర్హులైన తమందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు. వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డితో కలిసి ఈ వినతిపత్రం అందజేశారు. మండలంలోని చాలా మంది ఇళ్ల స్థలాలు కోసం దరఖాస్తు చేసి ఉన్నారని జిల్లా అధికారుల లాగిన్‌లో ఉన్నందున ఎన్నికల తర్వాత మంజూరయ్యే అవకాశం ఉందని సూర్యనారాయణ రెడ్డి వారికి తెలిపారు. గ్రామ ఉప సర్పంచ్ రాయి ఈశ్వరరావు పాల్గొన్నారు.

సైన్స్, మ్యాథ్స్ కాంప్లెక్స్ పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సైన్సు, మ్యాథ్స్ కాంప్లెక్స్ సమావేశాలను ఎంఇఒ పి బాల భాస్కరరావు సోమవారం పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఈ కాంప్లెక్స్ సమావేశాలను వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని అందుకు ఈ స్కూల్ కాంప్లెక్స్‌లు ఉపయోగపడతాయని చెప్పారు. సమావేశంలో సోంపురం, వేపాడ స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్ బిపిఎ రాజు, ఎస్ఎస్ఎ వల్లి, ఆర్‌పిఎస్, వేపాడ, ఎల్‌కోట మండలాలకు చెందిన సైన్సు, మ్యాథ్స్ ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

బొద్దాంలో: ఎంఇఒ జి జగదీశ్వర్ రావు బొద్దాం ప్రైమరీ లెవెల్ స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌ను సందర్శించారు. ఉపాధ్యాయుల ఉద్దేశించి మీటింగ్ యొక్క సారాంశాన్ని, రెండు కాంప్లెక్స్ నుంచి వచ్చిన ఉపాధ్యాయుల పిల్లల స్థాయిలు మెరుగుపరచడానికి ఏ విధమైన బోధన పద్ధతులు అవలంబిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ హెచ్ఎం వి భాస్కర రావు, రిసోర్స్ పర్సన్, రెండు కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, సిఆర్‌పి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పరిశీలన

ప్రజాశక్తి - గుర్ల

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పంటలను ఉత్తర కోస్తా రీజనల్ అధికారి ప్రకాష్‌రావు సోమవారం పరిశీలించారు. గ్రామంలో రైతులు పిల్లా చిరంజీవి, లలిత, పిల్లా రాజేశ్వరి, కనక దుర్గ, లండా దుర్గారావు పొలంలో కూరగాయలు పంటలతో ఏటీఎం మోడల్ ప్రకృతి వ్యవసాయాన్ని రైతులకు వివరించారు. ఏటీఎం మోడల్‌లో ఒక బెడ్ వెడల్పు నాలుగడుగులు మధ్యలో ఒక అడుగు కాలువ ఏర్పాటు చేసుకొని పంటలను సాగుచేయాలన్నారు. ఈ విధంగా ఏర్పాటు చేసుకున్న బెడ్డపై దుంప జాతి ముల్లంగి, బీట్రూట్, క్యారెట్, కాయగూరలు వంగ, టమాట, మిరప, చిక్కుడు, గోరుచిక్కుడు, అనుములు, అలసందలు, బెండ, ఆకుకూరలు, బహువార్షిక జొన్న, సజ్జ, మొదలగు పండ్లు నిర్ణీత కొలతల ప్రకారం వేసుకోవాలన్నారు. దీని ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునన్నారు. గరిడ గ్రామంలో శాశ్వత జీవామృతం పిట్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

మొయిదలో కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

మండలంలోని మొయిదలో సోమవారం వీవర్స్ సొసైటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ పివివి సూర్య నారాయణ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి చూపు ఇబ్బందులు పడుతున్న వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పెనుమత్స సంతోష్‌బాబు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, బొమ్మన రామారావు మాస్టర్, సంబంధిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే అక్కసు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో జరిగిన అభివృద్ధిని చూసి టిడిపి నాయకులు ఓర్వలేక అక్కసు వెళ్లగక్కుతున్నారని వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, ఫ్లోర్‌లీడర్ ఎస్‌వివి రాజేష్ తెలిపారు. సోమవారం కోలగట్ల నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిపై నారా లోకేష్ చేసిన ఆరోపణలను ఖండిస్తే, జీర్ణించుకోలేని స్థానిక టిడిపి నాయకులు విమర్శలకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి కోలగట్ల వీరభద్ర స్వామితోనే సాధ్యమైందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో వైసిపి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కల్లబొల్లి మాటలు చెపుతూ పబ్బం గడుపుకునే టిడిపి నాయకులు కళ్లు తెరిచి అభివృద్ధిని చూడాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు మారం బాల బ్రహ్మారెడ్డి, బొద్దాన అప్పారావు, గాదం మురళి, పిలక శ్రీను, చంద్రమౌళి, పాల్గొన్నారు.

మళ్లీ సొంతగూటికి 400 కుటుంబాలు

ప్రజాశక్తి- బొబ్బిలి

పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలిలో టిడిపికు భారీ షాక్ తగిలింది. అలజంగిలో వైసిపిని వీడి టిడిపిలో చేరిన వారం రోజులు గడవక ముందే టిడిపి నుంచి మళ్లీ వైసిపిలోకి 400 కుటుంబాలు చేరాయి. టిడిపిలో చేరిన సమయంలో ఎలాగైతే భారీ ర్యాలీ చేసి కోటకు చేరుకున్నారో, సోమవారం కూడా భారీ ర్యాలీగా వైసిపి కార్యాలయానికి చేరుకుని వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కండువాలు వేసి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో వైసిపి విజయం ఖాయమని ఎమ్మెల్యే అన్నారు. విజయానికి ఐక్యంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల్, తూముల భాస్కరరావు, తమ్మిరెడ్డి దామోదర్, పూడి చిన్న తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై కళాజాతా

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని గొట్లాంలో సోమవారం బాల్య వివాహాల పై కళాజాత ద్వారా అవగాహన కల్పించారు. చిన్న వయసులో వివాహాలు చేయటం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, వివాహ జీవితం పైన అవగాహన లేక అనేక ఇబ్బందులు గురవుతారని అవగాహన కల్పించారు. తల్లితండ్రులు ఆలోచించి ఆడపిల్లలకు 18 సంవత్సరాలు దాటిన తరువాత వివాహం చేయాలని కోరారు. గంట్యాడ ఐసిడియస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిడిపిఒ డి. ఉమా భారతి, పిఎసియస్ అధ్యక్షులు మహంతి రమణ, వైసిపి నాయకులు మీసాల తులసీరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్పలనాయుడు, వెంకటరావు, సురేష్, విశ్వనాథం

లోకేష్‌ది తప్పుడు ప్రచారం

ప్రజాశక్తి - కొత్తవలస

వేపాడ మండలంలోని సోంపురంలో జరిగిన సమావేశంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని బోధన వారి కుటుంబం సభ్యులు విమర్శించారు. తమ తాత ముత్తాతల నుంచి సంక్రమించిన సూరిబాబు తోట విషయంలో తప్పుడు ప్రచారం చేయడం తగదని బోధల అప్పలనాయుడు, విశ్వనాథం, వెంకట్రావు, సురేష్ చెప్పారు. ఆర్ఒఆర్ రికార్డులో తమకు దకలు పడిన భూములను ఈ విధంగా తప్పుడు ప్రచారం చేయడం టిడిపికి తగదని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు భార్య తమ మేనకోడలని, ఆమెకు 25 సెంట్లు భూమిని రాసిచ్చామని చెప్పారు. ఈ స్థలంలో కోటి రూపాయలు వెచ్చించి ఇల్లు నిర్మించుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు ఈ భూమి విలువ రెండు కోట్ల వరకు ఉంటుందని చెప్పారు. దీనిపై లేనిపోని ఆరోపణ చేయడం టిడిపికి తగదని, టిడిపి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తమ బంధువైనప్పటికీ ఇలాంటి ఆరోపణలు చేయడం సమంజసం కాదని అన్నారు.

ఎస్‌సిలో చేర్చాలని రజకుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆర్థికంగా వెనుకబడిన రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని ఎపి రజక సంఘం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తంగేటి భాస్కరరావు, జంపా చిన్న మాట్లాడుతూ దేశంలోని 17 రాష్ట్రాలలో రజకులు ఎస్‌సి జాబితాలో కొనసాగుతున్నారని తెలిపారు. ఇక్కడా రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రజకులకు పక్కా గృహనిర్మాణాలు చేపట్టాలని, దోబీ ఘాట్లను ప్రతి గ్రామ, పట్టణంలో నిర్మించాలని కోరారు. 50 ఏళ్లు దాటిన వారికి రూ.5 వేలు పింఛను ఇవ్వాలని, సబ్సిడీపై రూ.10లక్షలు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సాంఘిక బహిష్కరణలు, దౌర్జన్యాలు, దాడులు ఆపాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతి అందించారు.

నేటి నుంచి ఖాదర్ బాబా మహోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

హజరత్ సయ్యద్ షహిన్ షా బాబా ఖాదర్ వలి 65వ మహా సూఫీ సుగంధ మహోత్సవం మంగళవారం ప్రారంభమవుతుందని ఖాదర్ బాబా దర్గా దర్బార్ షరీఫ్ ముతవల్లి (ధర్మకర్త) డాక్టర్ ఖలీల్ బాబు తెలిపారు. సోమవారం దర్బార్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉరుసు మహోత్సవం వివరాలను, ఏర్పాట్లు గురించి వివరించారు. మంగళవారం ఉదయం 6 గంటలకు ఖురాన్ షరీఫ్ పఠనంతో ఉరుస్ మహోత్సవం ప్రారంభమౌతుందని చెప్పారు. మూడు రోజులపాటు ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవానికి వచ్చే యాత్రికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.